


వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దు

వరంగల్ రీజియన్ పరిధిలో 48 పాలకవర్గాలకు ఉత్తర్వులు

మిగిలిన వాటికి గతంలోనే ముగిసిన పదవీ కాలం

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాలను రద్దు చేస్తూ మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 110 వ్యవసాయ మార్కెట్లకు గాను 48 మార్కెట్ల పాలకవర్గాలు రద్దయ్యాయి. ఇక మిగిలిన పాలక వర్గాలకు గతంలోనే సమయం ముగిసిపోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 198 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలను నియమించేందుకు మార్గం సుగమం కాగా.. ఆ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు సన్నాహాలు చేసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే పాలకవర్గాలు రద్దు కావడంతో పాలనపరమైన ఇబ్బందులు తలెత్తకుండా మార్కెటింగ్‌శాఖ అధికారులను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించారు. సెలక్షన్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు జేడీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా, స్పెషల్ గ్రేడ్ మార్కెట్ కమిటీలకు డీడీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా అంతకంటే దిగువస్థాయి మార్కెట్ కమిటీలకు డీఎంవోలు పర్సన్ ఇన్‌చార్జీలుగా ప్రభుత్వం నియమించింది.

రద్దయిన మార్కెట్ కమిటీలు ఇవే..

వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట, జనగామ జిల్లాలో కొడకండ్ల, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలోని కాటారం, చిట్యాల, ఖమ్మం జిల్లాలోని మధిర, నేలకొండపల్లి, వైరా, కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి, గంగాధర, గోపాల్‌రావుపేట కమిటీలు, సిరిసిల్ల జిల్లాలోని పోత్గల్, గంభీరావ్‌పేట్, రాచర్ల బొప్పాపూర్, రుద్రాంగి, ఇల్లంతకుంట, బోయిన్‌పల్లి, వీరన్నపల్లి మార్కెట్ కమిటీలున్నాయి. అలాగే జగిత్యాల జిల్లాలో పెగడపల్లి, వెల్గతూర్, రాయ్‌కల్, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల్, కత్తలపూర్, మేడిపల్లి మార్కెట్ కమిటీలు, పెద్దపల్లి జిల్లాలోని కమాన్‌పూర్, సుల్తానాబాద్, ధర్మారం, మంథని మార్కెట్ కమిటీలు రద్దయిన వాటిలో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలోని నిడమనూర్, హాలియా, నల్గొండ, నకిరేకల్, చిట్యాల, శాలింగోవరం మార్కెట్ కమిటీలు కూడా రద్దయ్యాయి. సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి, నేరేడుచర్ల, తిరుమలగిరి, యాదాద్రి జిల్లాలో ఆలేరు, వలిగొండ, ఆదిలాబాద్ జిల్లాలో జైనాథ్, భోథ్, నిర్మల్ జిల్లాలో నిర్మల్, ఖానాపూర్, సారంగపూర్, మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి, జన్నారం కమిటీలు రద్దయ్యాయి.

కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు

రద్దయిన మార్కెట్ కమిటీలు తమ చేతికి చిక్కనున్న నేపథ్యంలో ఆయా మార్కెట్ల పరిధిలోని కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తమ పార్టీ అధికారంలోకి రావడానికి, అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేసిన నాయకులు తమకు నామినేటెడ్ పదవి కావాలని ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్ మంత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్న దగ్గర వారి పరిధిలో ఉన్న మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసుకునేందుకు నేరుగా ప్రతిపాదనలు పంపించే అవకాశం ఉండగా.. ఇతర పార్టీ ఎమ్మెల్యేలున్న చోట జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మార్కెట్ కమిటీల పాలకవర్గా లకు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించే అవకాశం ఉంది. ఇప్పటికే చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల ముఖ్య నాయకులు పోటీ పడుతుండగా కొందరు కనీసం పాలకవర్గంలో సభ్యుడిగానైన అవకాశం కల్పించాలని స్థానిక కాంగ్రెస్ ఎమ్మె ల్యేలను, ఇన్‌చార్జ్ మంత్రులను ప్రసన్నం చేసుకుంటున్నారు.

మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

వరంగల్ టౌన్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడో రోజులుసెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న దేశ వ్యాప్త సమ్మెను పురస్కరించుకుని సెలవు, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు తిరిగి సోమవారం మార్కెట్లో యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని వెల్లడించారు.





మామిడాకులు, ఆనపకాయ, కోడిపిల్లతో కట్టిన తోరణం

రక్షా తోరణం కట్టిన అనంతరం కల్లు, పానకం ఆరబోస్తున్న వడ్డెలు

- మహాజాతరలో ముఖ్యఘట్టాన్ని నిర్వహించిన వడ్డెలు
- వనదేవతల పూజాసామగ్రిని శుద్ధి చేసిన పూజారులు
- సమ్మక్క, సారలమ్మ గోవిందరాజులు, పగిడిద్దరాజు మందిరాల వద్ద పూజలు

ద్వార బంధనాలు.. రక్షా తోరణాలు

మేడారంలో ఘనంగా మండమెలిగే పండుగ

భక్తి పారవశ్యం..

మేడారం మహాజాతరలో ముఖ్యఘట్టమైన మండమెలిగే పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, ఏటూరునాగారం మండలంలోని గోవిందరాజులు, గంగారం మండలం పూనుగొండ్లలోని పగిడిద్దరాజు పూజామందిరాల్లో వడ్డెలు (పూజారులు) ఈ వేడుకను ఆదివాసీ సంప్రదాయంలో చేయగా.. వారి కుటుంబసభ్యులు దేవాలయాలను శుద్ధిచేసి అలుకుపూతలు, మామిడి తోరణాలతో అలంకరించారు. అనంతరం డోలు వాయిద్యాలతో గ్రామ పొలిమేరకు చేరుకొని గ్రామదేవతలకు జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. దుష్టశక్తులు పొలిమేర దాటి ఊరిలోకి ప్రవేశించకుండా ద్వారస్తంభాలు ఏర్పాటు చేసి.. మామిడాకులు, నల్లకోడి, ఆనపకాయలతో రక్షాతోరణాలు కట్టారు. పానకం, కల్లు, మద్యం ఆరబోశారు. వనదేవతల గద్దెల వద్ద ప్రధాన పూజారులు రాత్రి జాగరణ చేశారు. ఇక మేడారానికి భక్తుల రాక మరింత పెరగనుండగా.. బుధవారం సుమారు 50 వేల మంది దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. అలాగే ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మహాజాతర కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

- మేడారం

భక్తులతో కిక్కిరిసిన గద్దెల ప్రాంగణం



వివరాలు 7లో..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించాలి

అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య ఆదేశం

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్షించి, తగు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు మండలాల్లో పాలేరు నుంచి రాయపర్తి, నర్సంపేట మండలాలకు ధర్మసాగర్ నుంచి పర్వతగిరి, వర్ధన్నపేట మండలాలకు, పరకాల సెగ్మెంట్‌లో సంగెం, గీసుగొండ మండలాలు మిషన్ భగీరథ ద్వారా సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి ప్రారంభమైన దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించి ప్రణాళిక బద్ధంగా మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య పునరావృత్తం కాకుండా చూడాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్రస్థాయిలో గ్రామాలు తిరిగి తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. అన్ని గ్రామాల్లో వెంటనే బోర్ల మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా పంచాయతీ శాఖ అధికారి కల్పన, మిషన్ భగీరథ ఎస్ఈ రాములు, ఈఈ వెంకట్రాంరెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 14: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఏసీపీలను బదిలీ చేయడంతో పాటు పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఇటీవల మామునూరు ఏసీపీ సతీష్‌బాబును తెలంగాణ రాష్ట్ర డీసీపీకి అటాచ్ చేయగా, ప్రస్తుతం జరిగిన బదిలీ లలో తిరిగి మామునూరుకు ఏసీపీగా తిరిగి పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. కమిషనరేట్ నుంచి ఆరుగురు ఏసీపీలను బదిలీ చేశారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని డీసీపీ ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
పి. తిరుమల్	వరంగల్ ట్రాఫిక్	కాజీపేట
సి. సతీష్‌బాబు	డీజీ అటాచ్	మామునూరు
భీంశర్మ	హైదరాబాద్	ఎస్‌బీ- 2
ఎల్.రమేష్‌కుమార్	ఎస్‌బీ- 2	చిక్కడపెల్లి
గజ్జి కృష్ణ	సీసీఆర్‌బీ వరంగల్	పెద్దపెల్లి
అబ్దుల్‌రహీం	మామునూరు	కొత్తగూడెం

యువకుడి దారుణ హత్య





శ్రీనివాస్ మృతదేహం, పెళ్లినాటి ఫొటో

- కుటుంబ కలహాల నేపథ్యంలో హతమార్చిన అత్తింటివారు
- కళ్లలో కారం చల్లి, బండరాయితో మోది, మెడకు తాడు బిగించి హతం
- భార్యతో విడిగా ఉంటూ సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెడుతుండటంపై ఆగ్రహం
- రంగశాయిపేటలో ఘటన

కరీమాబాద్, ఫిబ్రవరి 14: భార్యాభర్తల మధ్య ఏర్పడిన కలహాలు ఆ యువకుడి హత్యకు దారితీశాయి. భార్య తనను విడిచివెళ్లిపోవడానికి అత్తింటివారే కారణమని కక్ష పెంచుకున్న అతడు.. తరచూ భార్యతో పాటు తమపై సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెడుతుండటాన్ని జీర్ణించుకోలేకపోయిన అత్తింటివారు అతడిని దారుణంగా హతమార్చారు. కంట్లో కారం చల్లి.. బండరాయితో మోది.. మెడకు తాడును బిగించి హత్యచేశారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి వరంగల్‌లోని రంగశాయిపేటలో జరగ్గా బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌లోని రంగంపేట ప్రాంతానికి చెందిన బ్యాంకు ఉద్యోగి దుట్ట వెంకటరమణ, భాగ్య దంపతులకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు దుట్ట శ్రీనివాస్(32)కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి రంగశాయిపేట ప్రాంతానికి చెందిన హమాలీ పనిచేసే బజ్జూరి రమేష్- విజయ దంపతుల కూతురు రమ్యతో 2015లో వివాహమైంది. పెళ్లయిన ఏడాదికే భార్యాభర్తల మధ్య మన స్పర్థలు రావడంతో పలుమార్లు ఒకరి పై ఒకరు కేసులు పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఎనిమిదేళ్లుగా శ్రీనివాస్, రమ్యలు విడివిడిగా ఉంటున్నారు. శ్రీనివాస్, రమ్య దంపతులకు సంతానం కలగలేదు. అయితే భార్య తనను కాదని వేరుగా ఉండటాన్ని అత్తమామలు, బావమరిది సమర్థిస్తున్నారని శ్రీనివాస్ అత్తింటివారిపై కక్ష పెంచుకున్నాడు. అప్పటి నుంచి భార్య రమ్య, అత్త, మామ, బావమరిదిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడం ప్రారంభించాడు. సోషల్ మీడియా పోస్టుల ద్వారా వేధింపులు అధికమవడంతో కొంతకాలంగా రమ్యను ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంచారు. అయితే రంగశాయిపేటలో ప్రస్తుతం జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలకు రమ్య హైదరాబాద్‌ను తిరిగి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ మంగళవారం రాత్రి రంగశాయిపేటలోని అత్తారింటికి వెళ్లగా అతడిని చూసిన అత్తింటివారు తమ ఇంటికి ఎందుకొచ్చావని ప్రశ్నించడంతో.. వారికి శ్రీనివాస్‌కు మధ్య గొడవ ప్రారంభమై అది ఘర్షణకు దారితీసింది.

దీంతో శ్రీనివాస్‌పై భార్య, అత్త, మామ, బావమరిది నలుగురు కలిసి దాడిచేసి కళ్లల్లో కారం చల్లి, అక్కడున్న బండరాయితో తలపై బలంగా మోదారు. శ్రీనివాస్ కుప్పకూలడంతో.. ఇదే అదునుగా భావించి వారు అతడి మెడకు తాడును బిగించి బలంగా లాగడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. హత్య విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ సీఐ పి.మల్లయ్య, ఎస్సై వెంకన్నలు బుధవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అల్లుడిని హత్య చేసిన మామ రమేష్, అత్త విజయ, భార్య రమ, బావమరిది అఖిల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు తెలుస్తుండగా.. దీనికి సంబంధించిన విషయాలను పోలీసులు ధ్రువీకరించడం లేదు. కాగా, మృతుడు శ్రీనివాస్ తండ్రి దుట్ట వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బజ్జూరి రమేష్, విజయ, రమ్య అఖిల్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గడువులోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే..

- నెలాఖరు వరకు సమయం పెంపు
- లేదంటే మిల్లర్లపై చర్యలు
- ఏటా, ప్రతీ సీజన్‌లోనూ పెండింగే...

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 14: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా మిల్లర్లు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లర్ల అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈనెల 28వరకు గడువును పొడిగించింది. గడువులోగా మిల్లర్లకు సరఫరా చేసిన ధాన్యం మేరకు రావాల్సిన బియ్యాన్ని లెక్కకట్టి వసూల్ చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. మూడేళ్లుగా రైస్ మిల్లర్లు యాసంగి, వానాకాలం సీజన్లలో నిర్దేశించిన సమయంలో సరఫరా చేయాల్సిన బియ్యాన్ని సరఫరా చేయడం లేదు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ రైస్‌పై పెద్దగా పట్టింపు లేకపోవడంతో మిల్లర్లు ఇష్టం వచ్చినట్లు పెండింగ్ పెట్టారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం సీఎంఆర్ రైస్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. గడు వులోగా అప్పగించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదే శించింది. కాగా జిల్లాలో మొత్తం 116 రైస్ మిల్లులు ఉండగా సీఎమ్మార్ రైస్ కోసం జిల్లా పౌరసరఫరాల సంస్థ 103 రైస్ మిల్లులకే ధాన్యం సరఫరా చేసింది.



కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం...

జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యంతో అక్రమ వ్యాపారం చేస్తూ కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగైదు సీజన్లుగా 16మిల్లులు ప్రభుత్వానికి అప్పగించకుండా ధాన్యంతో పాటు సీఎమ్మార్ బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. గతంలో సీఎంఆర్ రైస్ అప్పగించని పలువురు మిల్లర్లపై కేసులు నమోదు అయిన ఘటనలూ ఉన్నాయి.

చర్యలు తప్పవు...

సీఎమ్మార్ రైస్ విషయంలో రెండు, మూడు సీజన్లుగా మిల్లర్లు మందగమనంలోనే ఉంటున్నారు. గత రెండు సీజన్లలో బియ్యం అప్పగించని మిల్లుల్లో సోదాలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి అధికారులకు మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఈనెల 28లోపు నిర్దేశిత సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది. అవసరమైతే జరిమానా విధించడంతోపాటు ఆర్.ఆర్. యాక్టు ప్రకారం మిల్లర్ల ఆస్తులు జప్తు చేసేలా రంగం సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఇదిలా ఉండగా బియ్యం అప్పగించని రైస్ మిల్లులపై రెవెన్యూ, పోలీస్,

తరువాయి 8వ పేజీలో

సీఎంఆర్ ధాన్యం వివరాలు(మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	కేటాయించిన ధాన్యం	ఇవ్వాల్సిన బియ్యం	ఇచ్చిన బియ్యం	రావాల్సిన బియ్యం
వానాకాలం(2021)	2,67,707	1,78,941	1,70,124	8,817
యాసంగి(2021)	1,21,529	82,291	79,856	2,435
వానాకాలం(2022)	1,79,922	1,21,017	1,17916	3,101
యాసంగి(2022)	1,53,904	1,04,390	31,354	73,036
వానాకాలం(2023)	56,967	38,248	ఇంకా ప్రారంభం కాలేదు	

సీపీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



వరంగల్ సిటీ, ఫిబ్రవరి 14: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటి సారిగా వరంగల్ పోలీస్ కమిష నర్ అంబర్ కిశోర్ ఝాను బుధ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పూలమొక్క అందించి, శాలుశాతో సన్మానించా రు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ పాల్గొన్నారు.

కేయూ బీఈడీ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 21

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 14: కాకతీయ యూనివర్సిటీ బీఈడీ రెగ్యులర్ మొదటి సెమిస్టర్ ఫీజులను ఫిబ్రవరి 21 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, డాక్టర్ చాడ రాధికారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 23 వరకు గడువు ఉందని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణభవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్‌ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో తిష్ఠవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ద్వార బంధనాలు.. రక్షాతోరణాలు

• మేడారంలో ఘనంగా మండమెలిగే పండుగ • మహాజాతరలో ముఖ్యఘట్టాన్ని నిర్వహించిన వడ్డెలు

మేడారం, ఫిబ్రవరి 14: మహాజాతరకు ముందు మేడారంలో ప్రధాన ఘట్టమైన మండమెలిగే పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా సామగ్రిని శుద్ధి చేశారు. వనదేవతల గద్దెలను అలిగి ముగ్గులు వేశారు. మేడారం గ్రామానికి వనదేవతల వడ్డెలు (పూజారులు) ద్వారబంధనాలు, రక్షా తోరణాలను కట్టారు. గ్రామ దేవతలకు పూజలు చేశారు. మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, ఏటూరునాగారం మండలంలోని గోవిందరాజులు, గంగారం మండలం పూనుగొండ్లలోని పగిడిద్దరాజు పూజా మందిరాల్లో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుకలను నిర్వహించారు.

ప్రధానంగా జాతర జరిగే మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయాలను పూజారులు, కుటుంబ సభ్యులు శుద్ధిచేసి అలుకు పూతలు, మామిడి తోరణాలతో అలంకరించారు. డోలు వాయిద్యాలతో గ్రామ, పొలిమేర దేవతల వద్దకు చేరుకొని జలాభిషేకాలు చేసి నూతన వస్త్రాలు సమర్పించారు. పసుపు, కుంకుమలిచ్చి కొబ్బరికాయలు కొట్టి నైవేద్యం సమర్పించారు. ఊరికి ఇరువైపులా ద్వారస్తంభాలు ఏర్పాటు చేసి.. దుష్టశక్తులు పొలిమేర దాటి లోపలికి ప్రవేశించకుండా మామిడాకులు, నల్లకోడి, ఆనపకాయలతో రక్షాతోరణాలు కట్టారు. కల్లు, మద్యం ఆరబోశారు. వనదేవతల గద్దెల వద్ద ప్రధాన పూజారులు రాత్రి జాగరణ చేసి.. 10గంటల తర్వాత దర్శనాలను నిలిపేసి దేవతలకు యాటపోతులను నైవేద్యంగా సమర్పించారు. తెల్లవారుజామున ఇళ్లకు చేరుకున్నారు.

మండమెలిగే పండుగ జరిగిన సరిగ్గా వారంరోజులకు ఈనెల 21న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకోవడంతో మహాజాతర ప్రారంభమవుతుంది. 22న సమ్మక్క గద్దెకు రావడంతో మహాఘట్టం ఆవిష్కృతమవుతుంది. 23న మొక్కుల సమర్పణ, 24న దేవతలను వనప్రవేశం చేయించడంతో జాతర ముగుస్తుంది. మండమెలిగే పండగ జరిగిన మరుసటిరోజు నుంచి మేడారానికి భక్తుల రాక పెరుగుతుంది. కానీ ఇప్పటికే లక్షల మంది వనదేవతలను దర్శించుకుని ముందస్తు మొక్కులు చెల్లించారు. బుధవారం సుమారు 3లక్షల మంది దేవతలను దర్శించుకున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఇక భక్తులకు రవాణా ఇబ్బందులు ఎదురవకుండా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపిస్తోంది.



మండమెలిగే పండు సందర్భంగా మేడారం సమ్మక్క - సాలరమ్మ ఆలయ ప్రధాన ద్వారం సమీపంలో రక్షా తోరణాలు కడుతున్న వడ్డెలు



మండమెలిగే పండు సందర్భంగా మేడారం గ్రామంలోని బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న గ్రామస్థులు, వడ్డెలు

తెల్లవారుజామున నుంచే..

మేడారం పూజారులు కుటుంబ సభ్యులు సహా తెల్లవారుజామున లేచి ఇళ్ల వాకిలి శుద్ధి చేసుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ గుడిలను శుద్ధి చేశారు. గ్రామంలో బొడ్రాయిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి పసుపు కుంకుమలతో అలంకరించారు. పూజలు చేసి దీపదూప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం వనదేవతల మందిరాల్లో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. వనదేవతలకు ప్రత్యేక పూజలు చేసి డోలు వాయిద్యాల నడుమ దీపదూప, పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, యాట మొక్కులను సమర్పించారు.

ద్వారతోరణాల ఏర్పాటు

మహాజాతరకు ముందుగా గ్రామానికి తూర్పు, పడమర ప్రవేశ మార్గాల్లో బూరుగు కర్రలకు పసుపు, కుంకుమలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మామిడి తోరణాలకు ఉల్లిగడ్డ, కోడిపిల్ల, కత్తి(దిష్టి తగలకుండా) కట్టారు. ధ్వజస్తంభాలను నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోకి ఎలాంటి దుష్ట శక్తులు రాకుండా ద్వారబంధం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఘట్టంతో ఉదయం పూజలు ముగిశాయి. అనంతరం రాత్రి సమయంలో సమ్మక్క ప్రధాన పూజారి (వడ్డె) కృష్ణయ్యతో కలిసి పూజారులు పసుపు, కుంకుమలు తీసుకుని బుర్ర కొమ్ములతో శబ్దాలు చేస్తూ డోలు వాయిద్యాల నడుమ సమ్మక్క గద్దెపైకి చేరుకున్నారు. గద్దెలపై పసుపు, కుంకుమలు పెట్టి విద్యుద్దీపాలను ఆర్పివేసి చిమ్మచీకట్లలో రహస్య పూజలు నిర్వహించారు. గద్దెల ప్రాంగణంలోనే రాత్రంతా చేశారు. సమ్మక్క, సారలమ్మల పూజారులు ఆనవాయితీగా శాక, (కల్లు) ఇచ్చిపుచ్చుకుని సంబరాలు చేసుకున్నారు. గురువారం తెల్లవారుజామున సమ్మక్క పూజారులు పూజా సామగ్రితో తిరిగి గుడికి వెళ్లారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడివద్ద

మండమెలిగే పండుగను కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. మొదట సారలమ్మ ఆలయంతోపాటు అమ్మవారి వస్త్రాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారి కాక సారయ్యతోపాటు సారలమ్మ పూజారులు కాక కిరణ్ పలువురు గ్రామానికి ప్రత్యేక పూజలు చేసి ద్వారబంధాలు వేశారు. డోలు వాయిద్యాలు, బుర్రకొమ్ముల శబ్దాలతో సారలమ్మ వద్దకు చేరుకుని విద్యుద్దీపాలు ఆర్పివేసి రహస్య పూజలు నిర్వహించారు. రాత్రంతా గద్దెల ప్రాంగణంలో పూజలు చేసి పూజారులు శాక ఇచ్చిపుచ్చుకుని సంబరాలు జరుపుకున్నారు. వీరు కూడా గురువారం తెల్లవారుజామున కన్నెపల్లి సారలమ్మ గుడికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రాముఖ్యం కలిగిన నాగులమ్మ

మేడారంలోని వనదేవతల గద్దెలకు బయటకు వెళ్లే దారి వద్ద ఉన్న నాగులమ్మ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాజాతరలో ఎవరికి విషపురుగులు కాటువేయకుండా ఉండాలని నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవతకు పసుపు, కుంకుమలు సమర్పించి దీపదూప నైవేద్యాలు సమర్పిస్తారు.. అయితే ఈ కార్యక్రమం తల్లుల గుడి నుంచి గద్దెలకు చేరుకునే సమయానికి ముందుగా చేస్తారు. దీంతో మేడారంలో ఎవరికీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగవని పూజారుల నమ్మకం.

మంత్రి సీతక్క హాజరు

మండమెలిగే పండుగలో మంత్రి సీతక్క బుధవారం రాత్రి హాజరయ్యారు. ఆదివాసీ పూజారులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీశ్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, డీఎస్పీ రవీందర్ తదితరులు ఉన్నారు.



సారలమ్మ దేవాలయంలో పూజా సామగ్రి శుద్ధి



కన్నెపల్లిలో సారలమ్మ దేవాలయం శుద్ధి అనంతరం వెళ్తున్న వడ్డెలు



పూజారి మునీందర్ నుంచి సమ్మక్క గుడికి పూజా సామగ్రిని తీసుకెళ్తున్న ప్రధాన పూజారి కృష్ణ తదితరులు



అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల సందడి

భక్తజన.. మేడారం

మేడారం, ఫిబ్రవరి 14: వనదేవతలను దర్శించుకోవడానికి మేడారానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహాజాతరకు ముందస్తుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లగా చూడాలని, తమ కోరికలు తీర్చాలని తల్లులను వేడుకున్నారు. గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, ముడుపులు సమర్పించారు. వనదేవతలకు జేజేలు, శివసత్తుల పూనకాలు, సన్నాయి వాయిద్యాలతో మేడారం పరిసరాలన్నీ హోరెత్తాయి. బుధవారం సుమారు 50 వేల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం తరలివచ్చిన భక్తులు తాత్కాలికంగా ఏర్పాటైన దుకాణాల్లో కొనుగోళ్లు చేస్తూ సందడి చేశారు.

నేడు ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం

హాజరుకానున్న మంత్రులు సురేఖ, సీతక్క

మేడారం, ఫిబ్రవరి 14: మేడారం మహాజాతర సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క హాజరుకానున్నారు. చైర్మన్‌గా అర్రెం లచ్చుతోపాటు 14 మంది డైరెక్టర్లు ప్రమాణం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ సంఘాల నేతలు అధిక సంఖ్యలో తరలిరావాలని లచ్చు నాయక్ కోరారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



నాయకపోడ్ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 14: ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం గట్టమ్మ ఎదురుపిల్ల ఉత్సవం జరిగింది. సాయంత్రం ఆదివాసీ నాయకపోడు సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీతక్క హాజరయ్యారు. గట్టమ్మను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురైన ఆదివాసీలు చైతన్యవంతులు కావాలన్నారు. ఆదివాసీల ఇలవేల్పులకు గుర్తింపు వచ్చేలా సహకారం అందిస్తాననిన్నారు. మేడారం మహాజాతర తర్వాత ప్రణాళిక రూపొందించి ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. ఆదివాసీలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, కూన దయానందసామి, కొత్త సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కోసం దరఖాస్తు చేసుకోవాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14: బెస్ట్ అవలేబుల్ స్కూల్స్ స్కీం కింద 2024-25 సంవత్సరానికి గాను చేరేందుకు జిల్లాలో అర్హత గల ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి. భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ స్కీంకు సంబంధించి 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్, 5వ తరగతి రెసిడెన్షియల్ కొరకు ఉన్నత విద్య ప్రమాణాలు కలిగిన ఆంగ్ల మాధ్యం పాఠశాలలకు సంబంధించిన ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విడిగా వసతి గృహం, మౌలిక వసతులు కలిగి ఉండాలన్నారు. 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ సంవత్సరానికి ఒక విద్యార్థికి ట్యూషన్ ఫీజు టెక్స్‌బుక్స్, నోట్ బుక్కులు యూనిఫాం, టై, బెల్టు, షూస్ రూ. 28వేలు, 5వ తరగతి రెసిడెన్షియల్ ట్యూషన్ ఫీజు, టెక్స్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్టు, షూస్ రూ. 42 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు.



ఏనుమాముల మార్కెట్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14: దేశ వ్యాప్తంగా 16న జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి పిలుపునిచ్చారు. బుధవారం ఏనుమాముల మార్కెట్ వద్ద సీఐటీయూ కాశిబుగ్గ ఏరియా కమిటీ కార్యదర్శి అక్కినపల్లి యాదగిరి అధ్యక్షతన కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. మాధవి మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సమ్మెను తలపెట్టామన్నారు. ర్యాలీకి సీపీఎం కాశిబుగ్గ ఏరియా కమిటీ కార్యదర్శి ఎమ్డీ, బషీర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు చిలువేరు సుస్మిత, జన్ను ప్రవీణ్, జన్ను చిట్టి, ఎనుగంటి రాజలింగం, సంగం శ్రీనివాస్, ఎస్‌కె పాషా పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

గీసుగొండ, ఫిబ్రవరి 14: మనుగొండకు చెందిన నల్లబెల్లి నిశాంత్, శ్రావణి దంపతులకు నాలుగేళ్ల కుమారుడు జోసఫ్ ఉన్నారు. జోసఫ్ అనారోగ్యానికి గురికాగా అతడిని హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేక ఇబ్బందులుపడుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి చికిత్స కోసం రూ.15వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందించారు. కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కొమ్ము శ్రీకాంత్, మాదాసి రాంబాబు, రాజు, క్రాంతి, రాజీవ్, ఉదయ్, శంకర్, లక్ష్మణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'దేవాదుల ద్వారా సాగునీరు అందించాలి'

సంగెం, ఫిబ్రవరి 14: రైతులు పంటలను పండించేకునేందుకు దేవాదుల ద్వారా సాగునీరు అందించాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. బుధవారం తీగరాజుపల్లి శివారులోని దేవాదుల పిల్ల కాలువ వద్ద రైతులతో కలిసిన నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేవాదుల ద్వారా సాగునీరు అందకపోజడంతో ఈప్రాంతంలోని పిల్ల కాల్వ పరిధిలోని పొలాలు ఎండిపోతున్నాయన్నారు. గవిచర్ల, రాంచంద్రాపురం, లోహిత, ఆశాలపల్లి, షాపూర్, కాట్రపల్లి, వెంకటాపూర్, తీగరాజుపల్లి గ్రామాల పరిధిలోని కాలువను వెంటనే మరమ్మతులు చేపట్టి సాగునీరు సజావుగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మల్లేశం, బాస్కర్, రాజు, అయిలయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

ఘనంగా అనాథ పిల్లల జన్మదిన వేడుకలు


పిల్లలకు కొత్తదుస్తులను అందిస్తున్న మహిళలు

గీసుగొండ, ఫిబ్రవరి 14: అనాథ పిల్లల్లో ఆనందాన్ని నింపేందుకు మహిళా సంఘాలు వారి పుట్టినరోజు వేడుకల్ని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లి బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలవికాస సంస్థ కొన్నేళ్లుగా అనాథపిల్లలను చేరదీసి విద్యాబుద్ధులు చెబుతోంది. మాతృప్రేమ, స్పర్శను కలిగించేందుకు వారి పుట్టినరోజును బాలవికాస పొదుపు సంఘ మహిళలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నర్సంపేట, గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, చెన్నారావుపేట, వరంగల్, హన్మకొండ మండలాలకు చెందిన 15 మంది అనాథలకు కొత్త దుస్తు లు అందించి కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో బాలవికాస సంస్థ మహిళా ప్రో గ్రాం మేనేజర్ లత, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జ్యోతి, ఫీల్డ్ కోఆర్డినేటర్స్ సరళ, అమూల్య, రైతు వికాస అధ్యక్షుడు కూసం రాజమౌళి, ఏరియా కో ఆర్డినేటర్‌లు శ్రీదేవి, రజిత, దేవేంద్ర, రమాదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా అనాథల సంరక్షణ కోసం గ్రామానికి చెందిన కూరపాటి లక్ష్మిరాజు రూ.5వేలు, స్టీల్ ప్లేట్‌లు, గ్లాస్‌లు టవల్స్, పండ్లను అందించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

రంగశాయిపేటలో యంత్ర ప్రతిష్ఠాపన చేసిన తుని పీఠాధిపతి సచ్చితానంద సరస్వతీ స్వామి



కరీమాబాద్‌లో ప్రతిష్ఠించిన బొడ్రాయి, రంగశాయిపేట బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ గుండు సుధారాణి

శంభునిపేట, ఫిబ్రవరి 14: రంగశాయి పేటలో గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా జరిగింది. వేడుకలకు తుని తపోవమ శృంగేరి పీఠాధిపతి సచ్చితానంద సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠాపన చేశారు. మహంకాళీ ఆలయ ప్రాంగణంలో ప్రధాన యాగశాలలో ప్రత్యేక పూజలు చేసి నెహ్రూ సెంటర్, రామాలయం వద్ద గ్రామదేవతల ప్రతిష్ఠాపన చేశారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి గ్రామదేవతలకు నవదాన్యాలు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అనంతసం రామాలయం, గాంధీ జంక్షన్, సాయినగర్ కాలనీ, ఉర్సు రోడ్, ఆదర్శనగర్ కాలనీ, మహిళా స్వశక్తి భవన్ ప్రాంతాల్లో అన్నదాలు ఏర్పాటు చేశారు.

గ్రామ దిగ్బంధం

ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 4 గంటల వరకు గ్రామ దిగ్బంధనం చేశారు. ఆచారం ప్రకారం గ్రామంలోకి రాకపోకలను నిలిపివేశారు. వేడుకలకు మేయర్ గుండు సుధారాణి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కార్పొరేటర్‌లు గుండు చందన, పోశాల పద్మ, ఉత్సవ కమిటీ కన్వీనర్‌లు కొల్లూరి యోగానంద్, కేడల పద్మజనార్దన్, గుండు పూర్ణచందర్, ఏసీపీ బోనాల కిషన్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ఎస్‌ఐ వెంకన్నలు ఉత్సవాలలో పాల్గొన్నారు.

కరీమాబాద్‌లో..

కరీమాబాద్ : అండర్ రైల్వేగేట్ ప్రాంతం కరీమాబాద్‌లో శ్రీభూలక్ష్మీ, శ్రీలక్ష్మి గ్రామదేవత బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పూజారి పోలోజు భాస్కరాచారి ఆధ్వర్యంలో బుధవారం యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపనలు, పూర్ణాహుతి, ప్రత్యేక పూజాధికాలు పూర్తిచేశారు.

రాత్రి బలిచల్లుట, పోలి పోయుట కార్యక్రమాలను నిర్వహించారు. స్థానికులు బయటకు వెళ్లకుండా, బయటివారు గ్రామంలోకి రాకుండా అష్టదిగ్బంధం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, మేయర్ గుండు సుధారాణి, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి బొడ్రాయిని దర్శించుకున్నారు.


హవనానికి హోమ సమిధలను తీసుకొస్తున్న అర్చకులు

రెండో రోజుకు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మట్టెవాడ, ఫిబ్రవరి 14: రంగరంగ వైభవంగా కొనసాగుతున్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. బట్టల బజార్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, వంశ పరంపర్య ఛైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, మాజీ మేయర్ గుండా ప్రకాష్, ట్రాఫిక్ సీఐ శ్రీధర్, ఉత్సవ సేవా సమితి సభ్యులు గందె గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

17న ఉచిత వైద్య, క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 14: దేశాయిపేటలోని ఒయాసిస్ పబ్లిక్ స్కూల్‌లో 17న ఉచిత వైద్య, క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఒయాసిస్ విద్యా సంస్థల ఛైర్మన్ జన్ను పరంజ్యోతి తెలిపారు. దేశాయిపేటలో బుధవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జన్ను పరంజ్యోతి ఫౌండేషన్, మన అమెరికా తెలుగు సంఘం (మాటా) సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాటా వ్యవస్థాపక సలహాదారుడు సామల ప్రదీప్ పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో రక్తదాన శిబిరం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 14: నగరంలో 18వ డివిజన్‌లోని ఆసిసి హై స్కూల్‌లో బుధవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. జన్ను ప్రదీప్ సంవత్సరికం సందర్భంగా రెడ్‌క్రాస్ సహకారంతో స్నేహితుల బృందం ఆధ్వర్యంలో 22యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్‌బ్యాంక్ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు జన్ను వివేక్, డాక్టర్ మోహన్‌రెడ్డి, నేరెళ్ల కుమార్, లింగాల సృజన్‌కుమార్, జన్ను దిలీప్, జన్ను ప్రణయ్‌రాజ్, నేరెళ్ల చందు, దేవరకొండ అఖిల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14 : కాశిబుగ్గ శ్రీరంగనాథస్వామి దేవాలయంలో వేంకటేశ్వరస్వామి అలువేలుమంగ, పద్మావతి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు 108 కలిశాలతో శత ఘటాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఆ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి ఆధ్వర్యంలో వసంత పంచమిని పురస్కరించుకుని ఉత్సవాలు జరిపారు. ముఖ్యఅతిథిగా ఆడిటర్ గోసికొండ సుధాకర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆరుట్ల క్రిష్ణమాచార్యులు, రామాచార్యులు, ప్రధాన కార్యదర్శి చిలుపురి సురేష్, కోశాధికారి సుల్తాన సమ్మక్క, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గిర్మాజీపేట: వసంత పంచమి సందర్భంగా శ్రీ విశ్వేశ్వరయ్య సంస్కృతాంధ్ర కళాశాలలో సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ వసంతపంచమి రోజు అక్షరాభ్యాసానికి, విద్యాదీక్షకు అనువైన రోజని ఈ రోజు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించడం సాంప్రదాయమే కాకుండా శుభకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పరాశరం రంగాచార్యులు, మేకల లింగమూర్తి,పరాశరం జయకృష్ణ, శెట్టి దేవరాజు, సుస్మిత, సిబ్బంది రాజు, లింగయ్య, వనమ్మ పాల్గొన్నారు.


శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మామునూరు : ఖిలావరంగల్ మండలం గాడెపల్లిలో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతి మాత విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, పుష్పమాలలు పూలతో పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న ఆధ్వర్యంలో కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళను కాపాడిన సీఐ

మట్టెవాడ, ఫిబ్రవరి 14: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళను సీఐ తన వాహనంలో ఆస్పత్రికి చేర్చిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. విధుల్లో భాగంగా హంటర్ రోడ్డు నుంచి మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు వెళ్తున్న సీఐ టి.గోపి అదే రోడ్డులో వాహన ప్రమాదంలో సావిత్రి గాయపడగా సీఐ తన పోలీసు వాహనంలో ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ గోపి

గడువులోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే..

5వ పేజీ తరువాయి

పౌరసరఫరా సంస్థలతో టాస్క్‌ఫోర్స్ త్వరలోనే దాడులు చేస్తాయనే ప్రచారంతో కొందరు మిల్లర్లు ముందుగానే సదర్దుకుంటున్నట్టు తెలిసింది.

ఇప్పటి వరకు 16 కేసులు నమోదు..

నిర్ధేశిత గడువులోగా సీఎంఆర్‌ను అప్పగించకుండా తాత్సారం చేసిన వివిధ రైస్ మిల్లులపై రెండేళ్లుగా 16కేసులు నమోదు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 2021లో 2 మిల్లులపై కేసులు నమోదు కాగా 2022లో 14 కేసులు నమోదు అయ్యాయి.

● ప్రభుత్వ ఆదేశానుసారం కఠిన చర్యలు తప్పవు...

బి. సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరా సంస్థ మేనేజర్

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సీఎంఆర్‌ను నిర్ధేశిత గడువులోగా అప్పగించకపోతే చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వ ఆదేశాలు, లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాము. మిల్లర్లు సీఎంఆర్‌ను పెండింగ్ ఉంచకుండా వారికి సరఫరా చేసిన ధాన్యానికి అనుగుణంగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. నిర్ధేశిత గడువు ముగిసిన తర్వాత ఎలాంటి వివరణలు ఉండవు. గడువులోగా మిల్లర్లు వారి లక్ష్యాలను పూర్తి చేయాలి.

రైతులపై దాడులను నిరసిస్తూ ధర్నా

గిర్మాజీపేట, ఫిబ్రవరి 14: గత రైతాంగ ఉద్యమ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని న్యూఢిల్లీలో ఆందోళనల చేస్తున్న రైతులపై పోలీసులు భాష్పవాయుగోళాలు ప్రయోగం, అరెస్ట్ చేయడం తగదని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ రాచర్ల బాలరాజు అన్నారు. రైతులపై దాడులను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం బాలరాజు ఆధ్వర్యంలో వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస మద్దతు ధర హక్కు, రుణ విమోచన చట్టం, స్వామినాథన్ కమిటీ నివేదిక అమలు తదితర డిమాండ్ల సాధనకు గతంలో న్యూఢిల్లీలో రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తే రైతుల డిమాండ్లను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని మోదీ విస్మరించారన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న జరిగే భారత్ గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మోర్చా నాయకులు సోమిడి శ్రీనివాస్, వీరగోని శంకరయ్య, ఎం.డి.ఇస్మాయిల్, ఎస్.భాస్కర్, నర్రా ప్రతాప్, ఎ.రాజేందర్, ఓదెల రాజయ్య, మల్లికార్జున్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

గడపగడపకూ బీజేపీ విజయాలను వివరించాలి

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14: గడప గడపకు వెళ్లి బీజేపీ, కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని బీజేపీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం కాశిబుగ్గ 70,71,88 బూతులలో 'గావ్ చలో అభియాన్' కో ఆర్డినేటర్ డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. మోదీ గ్యారెంటీలు, ఆర్టికల్ 370, చంద్రయాన్ 2, ఆదిత్య ఎల్-1, తదితర అంతరిక్ష అద్భుతాలు, మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, స్వచ్ఛ భారత్, కోవిడ్ నిర్వాహణ, విశ్వకర్మ యోజన, ముద్ర లోన్లు తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ, కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, కుసుకుంట్ల రంజిత్, దోమల భవానీ శంకర్, కందుకూరి శ్రీనివాస్, కోట సతీష్, అపురూప రజనీష్ నేత పాల్గొన్నారు.


బీజేపీ విజయాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మురళీధర్ గౌడ్

వండేది ఇలా.. తినేది ఎలా..?

• వాడిన నూనెనే పదే పదే వాడకం • రంగు, రుచికోసం కెమికల్ పూత • అపరిశుభ్ర వాతావరణంలో వంటలు
• రోగాల బారిన పడుతున్న వినియోగదారులు • పట్టించుకోని ఆహార నాణ్యత తనిఖీ అధికారులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14: నగరవాసులు బయటి ఫుడ్ తినేందుకు బేజారవుతున్నారు. గత్యంతరం లేక ఏదైనా తిన్నా రోగాలబారిన పడుతున్నారు. నగరంలో చాలా వరకు హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్‌సైడ్ తోపుడు బండ్లపై అమ్ముతున్న ఆహార పదార్థాలను నిబంధనలకు విరుద్ధంగా వండి వార్చుతున్నారు. అపరిశుభ్ర వాతావరణం, వాడిన నూనే వాడుతూ ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. చూడడానికి ఆహారం ఆకర్షణీయంగా కనిపిస్తూ నోరూరిస్తుండడంతో జనం వాటిని తినేందుకు ఇష్టపడుతున్నారు. కానీ వాటి వెనక వండుతున్న విధానం చూసి నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రసాయనాల వాడకం.. ఫ్రిజ్‌లలో నిల్వలు..

హోటళ్లు, రెస్టారెండ్లు, తోపుడు బండ్లపై తయారు చేసే బిర్యానీ, అల్పాహారం, కూరలు, ఇతర తినబండారాలను నాసిరకం నూనె.. వాడిన నూననే మళ్లీ మళ్లీ వాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కొందరు నిర్వాహకులు రుచికోసం కెమికల్స్ వాడితే, కొందరు నాలుగు సార్లు మరిగించిన నూనె వాడకం, అరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేస్తుండడంతో మండిపడుతున్నారు. అలాగే, కొందరు రెండు మూడురోజులు ఫుడ్‌ను ఫ్రిడ్జిలలో నిల్వచేసి అమ్మకాలు జరుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మటన్, చికెన్, చాపలు, ఇతర ఆహారపదార్థాలు మిగిలితే నిర్వాహకులు వాటిని పడేయకుండా మరుసటి రోజు కోసం ఫ్రిడ్జ్‌ల్లో పెట్టి, మర్నాడు, దట్టంగా మసాలాలు పట్టించి వేడిచేసి సర్వ్ చేస్తున్నారు. మంచి రంగు, రుచి, వాసన వస్తుందనే కారణంతో ఇష్టారాజ్యంగా కెమికల్స్ వాడుతున్నారని నగరవారులు వాపోతున్నారు.

నాసిరకం నూనెలతో వంటలు..

చాలావరకు హోటళ్లు, రెస్టారెంట్లు, తోపుడుబండ్లపై ఆహారపదార్థాల తయారీ కోసం వాడే నూనె తక్కువ ధర, లేదంటే నాసిరకం నూనెను ఎక్కువగా వాడుతున్నారు. మరిగించిన నూననే పదేపదే వాడడంతో నూనెలో ఉండే టోటల్ పోలార్ కంపోనెంట్స్ (టీపీసీ) ఫ్రీ రాడికల్స్‌గా మారుతాయని నిపుణులు చెబుతున్నారు. అలా మారడం వల్ల ఆ నూనెలో తయారు చేసిన ఆహార పదార్థాలు వల్ల ఫుడ్‌పాయిజన్ అయ్యే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.


మరుగుతున్న నూనెలో పూరీలు వేసిన దృశ్యం

అపరిశుభ్ర వాతావరణంలో..

ఆహారపదార్థాలు తయారు చేసే హోటళ్లు, రెస్టారెంట్లు, తోపుడుబండ్లు వంటను అపరిశుభ్ర వాతావరణంలోనే వండుతున్నారు. తోపుడుబండ్ల నిర్వాహకులు మోరీలు, చెత్త కుండీల పక్కనే ఆహార విక్రయాలు జరుపుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కిచెన్‌లు చాలావరకు అపరిశుభ్రంగా ఉంటున్నాయని నగరవాసులు వాపోతున్నారు.

జాడలేని ఆహార నాణ్యత తనిఖీ అధికారులు

నగరంలో నిబంధనలకు విరుద్ధం విచ్చలవిడిగా ఆహార పదార్థాల విక్రయాలు జరుగుతున్నా, అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేస్తున్నా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో తోపుడుబండ్ల వ్యాపారులు సాగిస్తున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్స్, హెల్త్ ఇన్‌స్పెక్టర్స్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్, విజిలెన్స్ అధికారులు పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఓసారి తూతూ మంత్రంగా అధికారులు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

పాచిపోయిన చికెన్ వడ్డించారు



నా బర్త్‌డే సందర్భంగా ఫ్రెండ్ నగరంలోని ఒక హోటల్‌కు వెళ్లి చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశాం. చికెన్ ముక్కకు దట్టంగా మసాల దట్టించారు. వాసన మంచిగా ఉన్నా, తింటే పాచి వాసన వచ్చింది. ఫుడ్ ఇలా ఉందని నిర్వాహకులను అడిగే మాతోనే వాగ్వాదానికి దిగారు. హోటల్ అని వెళ్తే, ఇలా చేశారు. **- ఎన్.హరి, శాంతినగర్**

వాడిన నూనెనే మళ్లీమళ్లీ వాడుతున్నారు



మా ప్రాంతంలో చాలావరకు తోపుడు బండ్లు ఉన్నాయి. ఓ ప్రాంతం మిర్చి, బజ్జీలకు ఫేమస్. సాయంత్రం అయిందంటే జనంతో కిక్కిరిసిపోతుంది. కానీ, ఎప్పుడు చూసినా వాడిన నూనెలో మళ్లీ నూనె పోసి మిర్చి బజ్జీలు వేస్తున్నారు. కొత్తగా నూనె పోసి చేసిన దృశ్యం చూడలేదు. **- శ్రీనివాస చారి, లక్ష్మీపురం**



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 15 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

నర్సంపేట మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్



నర్సంపేట, ఫిబ్రవరి 13 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ కమిషనర్‌గా బి.శ్రీనివాస్ నియామకమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా గత కొంత కాలంగా జమ్మికుంట మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన శ్రీనివాస్ నర్సంపేట మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వస్తున్నారు. గత రెండు సంవత్సరాలకు పైగా నర్సంపేట మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన నాయిని వెంకటస్వామిని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఒకటి రెండు రోజుల్లో నర్సంపేట కమిషనర్‌గా శ్రీనివాస్ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

అమృత లింగేశ్వరస్వామి
విగ్రహ ప్రతిష్ఠాపన, హోమ పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

నర్సంపేట, ఫిబ్రవరి 13 : పట్టణంలోని శాంతినగర్‌లో బుధవారం రాజ శ్యామల ట్రస్టు ఆధ్వర్యంలో వెన్నంపల్లి వెంకట సత్యనారాయణ శర్మ, నిశాంత్ శర్మ, నారాయణశర్మ, నరేశ్‌శర్మ, అయినవోలు కృష్ణ మూర్తి శర్మల వేదమంత్రోచ్ఛా రణల నడుమ శ్రీమాతం గి రాజశ్యామల సహిత నాగఅమృత లింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. గత అయిదు రోజులుగా గణపతిపూజ, పుణ్యాహ వచనం, యాగశాల ప్రవేశం, అంకురారోపనం, అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమం, పంచామృతంతో అభిషేక పూజలు నిర్వహించారు. రాజశ్యామల అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజశ్యామల, మాతంగి హోమపూజలో పాటు రాజశ్యామల సహిత నాగామృత లింగేశ్వరస్వామి యంత్ర, విగ్రహ ప్రతి ష్ఠాపన పూజలను వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన, హోమ పూజల్లో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ పాలాయి రవికుమార్, శ్రీరాముల శంకరయ్య, కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, రేమిడి శ్రీనివాస్, వేమిశెట్టి శ్రీనివాస్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కోసం దరఖాస్తు చేసుకోవాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : బెస్ట్ అవలెబుల్ స్కూల్స్ స్కీం కింద 2024-25 సంవత్సరానికి గాను చేరేందుకు జిల్లాలో అర్హత గల ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి. భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కీంకు సంబంధించి 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్, 5వ తరగతి రెసిడెన్షియల్ కొరకు ఉన్నత విద్య ప్రమాణాలు కలిగిన ఆంగ్ల మాధ్యం పాఠశాలలకు సంబంధించిన ఈ నెల 28 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విడిగా వసతి గృహం, మౌలిక వసతులు కలిగి ఉండాలన్నారు. 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ సంవత్సరానికి ఒక విద్యార్థికి ట్యూషన్ ఫీజు టెక్స్‌బుక్స్, నోట్ బుక్కులు యూనిఫాం, టై, బెల్టు, షూస్ రూ. 28వేలు, 5వ తరగతి రెసిడెన్షియల్ ట్యూషన్ ఫీజు, టెక్స్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్టు, షూస్ రూ. 42 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

• ఎంపీపీ బాదావత్ విజేందర్



విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్న ఎంపీపీ విజేందర్

చెన్నారావుపేట, ఫిబ్రవరి 14 : విద్యార్థులు పరీక్షలంటే భయ భ్రాంతులకు గురికావద్దని ఎంపీపీ బాదావత్ విజేంద ర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గు రుకుల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు పాఠాల ను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష సమయంలో సమయాన్ని వృథా చేయరాదన్నారు. ప్ర తీ విద్యార్థి చదువును ఇష్టపడి చదవాలన్నారు. విద్యార్థులు ఎలాంటి మనోవేదనకు గురికావద్దన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సమయంలో ఎలా పరీక్ష పత్రాన్ని చదవి, జవాబులను రాయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో జ్యోతి, ఉపాధ్యాయునీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 14 : గిరిజనుల ఆరాధ్యదైవంమైన సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ బుధవారం పిలుపు నిచ్చారు. ఈ నెల 15న నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట రోడ్డులో ఉన్న సేవాలాల్ దేవాలయం వద్ద గిరిజనులు, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవోలతో పాటు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలకు వివిధ రాజకీయ పక్ష నాయకులు, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

బియ్యం ధర.. వింటేనే భయం

• రూ. 5వేల నుంచి 6వేలు పలుకుతున్న ధర



నిల్వ ఉన్న సన్న బియ్యం బస్తాలు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 14 : బియ్యం ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులక ఇబ్బందులు తప్పడం లేదు. బియ్యంతోపాటు పప్పులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్ది రోజులుగా పప్పుల ధరలు పెరగగా, ప్రధానంగా కందిపప్పు ధర రెట్టింపు స్థాయి చేరుకుంది. ప్రస్తుతం సన్నరకాల బియ్యం ధర క్వింటాల్‌కు రూ. 6వేలకు పైగా పలుకుతుండగా, ఇతర రకాలకు రూ. 4,500 నుంచి రూ. 5,200 వరకు పలుకుతోంది. సీజన్‌తో పోలిస్తే క్వింటాకు ఏకంగా రూ. 2వేల నుంచి రూ. 2700 వరకు పెరిగింది.

• ఎగబాగుతున్న ధరలు

ఎండల తీవ్రతతో పంట ఏపుగా పెరగకపోవడంతోపాటు ఆవించిన స్థాయిలో పంట ఆరోగ్యంగా ఎదగలేదని రైతులు అంటున్నారు. గతంలో సన్నరకం పచ్చి వడ్లు ఎకరాకు 40-45 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. ఇప్పుడు 25-30 బస్తాల దిగుబడి రావడమే కష్టమని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో వరి ధాన్యం తడవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. సన్న రకాలు అంతంత మాత్రమే దిగుబడి వస్తుంది. దానికి తోడు అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు కొనే పరిస్థితి ఉండదు. దీంతో సన్నరకం బియ్యానికి ఇంకా ధర పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈసారి దిగుబడి బాగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం సన్న రకాలను హోల్‌సేల్ మార్కెట్‌లో రూ. 56 నుంచి 62 వరకు విక్రయిస్తున్నారు. బీపీటీ పాతరకం బియ్యానికి కిలో రూ. 60 కాగా కొత్తవాటికి రూ. 54 వరకు ధర పలుకుతోంది. హెచ్‌ఎంటీ రకం హోల్‌సేల్ రూ. 62 కాగా ఇక రిటెయిల్ మార్కెట్‌లో కిలో రూ. 2 నుంచి రూ. 3 వరకు పెంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అలాగే సాధారణ రకాలను వివిధ పలు రకాల బ్రాండ్లతో రూ. 45 నుంచి రూ. 52 వరకు అమ్ముతుండటంతో ప్రజలకు భారం తప్పడం లేదు. పంట సీజన్‌తో పోలిస్తే ప్రస్తుతం బియ్యం ధరలు గణనీయంగా పెరిగాయి. సన్న రకాల్లో కొన్ని రెట్టింపుస్థాయికి చేరాయి. పంటలు చేతికందే జనవరిలో సన్న బియ్యం ధర రకాన్ని బట్టి క్వింటాల్‌కు రూ. 3,400 నుంచి రూ. 3,800 వరకు ఉంటుంది. పాత బియ్యం అయితే వాటి ధర కొద్దిగా పెరిగే అవకాశం ఉంటుంది. అయినా సన్న రకాల ధర రూ. 4500 నుంచి రూ.5000 మించి పలకపోగా ఈ సంవత్సరం బియ్యం ధరలు ఇంకా పెంచి విక్రయించేందుకు వ్యాపారులు అడుగులు వేస్తున్నారు. బాస్మతి బియ్యం అయితే కిలో రూ. 135 నుంచి రూ. 150 వరకు విక్రయిస్తున్నారు.

• కారణాలు

ఖరీఫ్‌లో పండించిన వరి ధాన్యం నాణ్యత చాలా బాగుంటుంది. యాసంగిలో పం డించిన వరి ధాన్యంపై కొందరు ఆసక్తి చూపడం లేదనే వాదన ఉంది. యాసంగి పంట మర పట్టిస్తే నూకల శాతం అధికంగా ఉంటుందని చాలా మంది ఖరీఫ్ సమ యంలోనే బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఇప్పుడు దొడ్డు రకం బియ్యాన్ని తినేం దుకు చాలా వరకు ఎవరూ ఇష్టపడటంలేదు. ప్రతి ఒక్కరూ సన్నరకం బియ్యం వైపే మొగ్గు చూపుతుండటంతో వాటి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సన్న రకా ల ధాన్యం నిల్వల కొరతతో బియ్యం ధరలు పెరగడానికి కారణంగా భావిస్తున్నారు. రైతుల వద్దే కాక మార్కెట్‌లో సైతం నిల్వలు తగ్గాయి. ఈ సంవత్సరం రైతులు ధాన్యాన్ని అంతగా నిల్వ చేయకపోగా, నిల్వ చేసిన వారు అమ్మేశారు. సాగు తగ్గడం కూడా బియ్యం ధరలు పెరగడానికి కారణంగా చెబుతున్నారు.

ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరుడు



కస్తూర్బాలో వసంత పంచమి వేడుకలను చేస్తున్న ఉపాధ్యాయునీలు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని సిద్ధేశ్వర ఆలయంలోని సిద్ధేశ్వరుడిని వసంత పంచమిని పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరునికి పలు అభిషేక పూజలను నిర్వహించారు. అలాగే కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ఎస్‌వో జ్యోతి ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. భవిష్యత్‌కు చదువే ఆధారమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భిక్షమయ్యశాస్త్రి, సాయిశాస్త్రి, తేజస్విని, దేవిక, సుమలత, సుజాత, ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ...

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 14 : వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో ఆటో బోల్తాపడి ఆటో డ్రైవర్ అంబటి రాజుకు తీవ్ర గాయాలైనఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇల్లంద గ్రామం నుంచి కుమ్మరిగూడెం తండా రోడ్డును ఆటో క్రాస్ చేస్తున్న క్రమంలో ఆటో వెనుక భాగాన్ని ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడడంతో ఆటో డ్రైవర్ అంబటి రాజుకు తీవ్రగాయాలయ్యాయి. ద్వి చక్రవాహన దారులుకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, డ్రైవర్ రాజును స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

వర్ధన్నపేట ఏసీపీగా నర్సయ్య



వర్ధన్నపేట, ఫిబ్రవరి 14: వర్ధన్నపేట ఏసీపీగా నర్సయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతల అనంతరం పలు పోలీస్ స్టేషన్ల అధికారులు ఆయనను మర్యాద పూర్వకంగా ఇక్కడ పని చేసిన రఘుచందర్ జగిత్యాల ఏసీపీగా బదిలీ అయ్యారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



వెంకటరమణను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

వర్ధన్నపేట, ఫిబ్రవరి 14 : వర్ధన్నపేట ఎంపీడీవోగా వెంకటరమణ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజ్యలక్ష్మీ ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

నల్లబెల్లి ఎంపీడీవోగా నరసింహమూర్తి...



నల్లబెల్లి : నల్లబెల్లి నూతన ఎంపీడీవోగా నరసింహ మూర్తి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో నల్లబెల్లిలో పనిచేసిన ఎంపీడీవో విజయ్‌కుమార్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా హన్మకొండ జిల్లాకు బదిలీ అయ్యారు. అనంతరం జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలోని మలహార్ మండలంలో విధులు నిర్వహించిన ఎంపీడీవో నరసింహమూర్తి బుధవా రం నల్లబెల్లి మండల ఎంపీడీవోగా పదవీ బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది నరసింహమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

చెన్నారావుపేట ఎంపీడీవోగా గోవిందరావు...



ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

చెన్నారావుపేట : చెన్నారావుపేట మండల నూతన ఎంపీడీవోగా బి.గోవిందరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ గతంతో పని చేసిన ఎంపీడీవో భారతి ఖానాపురానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలకు స్వీకరించిన ఎంపీడీవోను మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరెంటెండెంట్ దయాకర్, ఏపీవో అరుణ, కార్యదర్శులు, టీఏలు. ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి ఎంపీడీవోగా అరుంధతి



దుగ్గొండి : దుగ్గొండి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా లెక్కల అరుంధతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో కృష్ణప్రసాద్ ములుగు జిల్లాకు బదిలీ కాగా, నూతన ఎంపీడీవోగా భూపాలపల్లి జిల్లా నుంచి బదిలీ అయిన అరుంధతి బాధ్యతలు చేపట్టారు.

ఖానాపురం ఎంపీడీవోగా భారతి ...



ఖానాపురం : ఖానాపురం ఎంపీడీవోగా ఈగల భారతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సుమనవాణి ములుగు జిల్లాకు బదిలీపై వెళ్లారు. కాగా, చెన్నరావుపేట మండలంలో డిప్యూటేషన్ పద్ధతిలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఈగల భారతి ఖానాపురం ఎంపీడీవోగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

రేపు మండల సర్వ సభ్య సమావేశం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 14 : మండల సర్వ సభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోవిందరావు బుధవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి అధికారులు. ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

• వ్యాపార సంస్థల యాజమాన్యాలకు సమ్మె నోటీసు

• బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్



రైస్ మిల్ యజమానికి సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 14 : కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అనంతగిరి రవి. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. ఈ నెల 16న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, కిరాణ వర్తక సంఘం, ఐరన్ హార్డ్‌వేర్, ఫర్టిలైజర్స్ షాపుల యాజమాన్యాలకు బుధవారం సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా కార్మిక చట్టాలను కేంద్రం సవరణలు చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యతతో తిప్పికొట్టాలని వారు పిలుపు నిచ్చారు. ఢిల్లీలో రైతులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు. కనీస మద్దతు ధర చట్టాన్ని పార్లమెంట్‌లో అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఢిల్లీ ముట్టడిలో పాల్గొన్న రైతులపై భాష్పవాయువు ప్రయోగించి లాఠీచార్జీ చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కందికొండరాజు, నాగులు, జనార్ధన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్ది మేడారంలో పనులను త్వరగా పూర్తి చేయండి

• నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి



మద్ది మేడారంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

నల్లబెల్లి, ఫిబ్రవరి 14: జాతర సమీపిస్తున్న వేళ మద్ది మేడారంలో పనులను తర్వగా పూర్తి చేయాలని నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి తెలిపారు. బుధవారం మండలంలోని మద్ది మేడారంలో పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖ అధికారులకు తర్వగా జాతర పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బొనగాని రాజేష్, మండల అధికారులు రవళి, పవిత్ర, మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి, మద్ది మేడారం ట్రస్ట్ చైర్మన్ గాదె సుదర్శన్, మద్ది మేడారం ఆలయ ప్రధాన పూజారి దురిశెట్టి సమ్మయ్య, నాగారాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 14 : వివాహిత అదృశ్యమైన సంఘటన మండటంలోని పాపయ్యపేట గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... పాపయ్యపేట గ్రామ శివారు గుడితండాకు చెందిన భూక్య హనుమా కూతురు అశ్వినిని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గుండెగ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వీరికి రెండు సంవత్సరాల కూతురు ఉంది. కాగా, మంగళవారం ఉదయం పుట్టింటికి వచ్చింది. ఇంట్లో ఉన్న ఆమె తెల్లవారేసరికి కనిపించకుండా పోయింది. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెదికనా ఆచూకి లభ్యంకాలేదు. దీంతో తండ్రి హనుమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు, సైకిళ్ల వితరణ



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న స్వప్నిల్

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 14 : వర్ధన్నపేట మండలం ఇల్లంద ప్రభుత్వ పాఠశాలకు ఇతర గ్రామాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థుల కోసం స్మృతి ఆర్గానిక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఎఫ్‌ఓ ఈగ స్వప్నిల్ బుధవారం ఉచితంగా సైకిళ్లు, కంప్యూటర్స్, స్కానర్, ప్రింటర్స్ పంపిణీ చేశారు. స్వప్నిల్ మాట్లాడుతూ తన తండ్రి చదువుకున్న పాఠశాలకు సేవ చేసే అదృష్టం కలగడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి, ప్రధానోపాధ్యాయులు విజయ, కార్యదర్శి రామారావు తదితరులు పాల్గొన్నారు.

17న ఉచిత వైద్య, క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 14: దేశాయిపేటలోని ఒయాసిస్ పబ్లిక్ స్కూల్‌లో 17న ఉచిత వైద్య, క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఒయాసిస్ విద్యా సంస్థల చైర్మన్ జన్ను పరంజ్యోతి తెలిపారు. దేశాయిపేటలో బుధవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జన్ను పరంజ్యోతి ఫౌండేషన్, మన అమెరికా తెలుగు సంఘం (మాటా) సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాటా వ్యవస్థాపక సలహాదారుడు సామల ప్రదీప్ పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే..

(5వ పేజీ తరువాయి)

పౌరసరఫరా సంస్థలతో టాస్క్‌ఫోర్స్ త్వరలోనే దాడులు చేస్తాయనే ప్రచారంతో కొందరు మిల్లర్లు ముందుగానే సదర్దుకుంటున్నట్టు తెలిసింది.

ఇప్పటి వరకు 16 కేసులు నమోదు...

నిర్దేశిత గడువులోగా సీఎంఆర్‌ను అప్పగించకుండా తాత్సారం చేసిన వివిధ రైస్ మిల్లులపై రెండేళ్లుగా 16కేసులు నమోదు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 2021లో 2 మిల్లులపై కేసులు నమోదు కాగా 2022లో 14 కేసులు నమోదు అయ్యాయి.

• ప్రభుత్వ ఆదేశానుసారం కఠిన చర్యలు తప్పవు...

బి. సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరా సంస్థ మేనేజర్

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సీఎంఆర్‌ను నిర్దేశిత గడువులోగా అప్పగించకపోతే చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వ ఆదేశాలు, లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నాము. మిల్లర్లు సీఎంఆర్‌ను పెండింగ్ ఉంచకుండా వారికి సరఫరా చేసిన ధాన్యానికి అనుగుణంగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఎలాంటి వివరణలు ఉండవు, గడువులోగా మిల్లర్లు వారి లక్ష్యాలను పూర్తి చేయాలి.

ఈగ మల్లేశం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాగెల్లి సురేశ్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 14: కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం జన్మదిన వేడుకలను బుధవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్‌ను నాగెల్లి సురేశ్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతి, తూళ్ల కుమారస్వామి, అంగోతు భిక్షపతి, తుమ్మల రవీందర్, సిలువేరు రాజ్‌కుమార్, పిట్టల రాజు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహిళా మండలి భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజలు చేస్తున్న వెంకటేశ్వర్లు

దుగ్గొండి, ఫిబ్రవరి 14 : మండలంలోని వెంకటాపురం గ్రామంలో మహిళా మండలి భవన నిర్మాణ పనులను బుధవారం పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇంగోలి రాజేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్రాన్స్‌లో పూర్వ విద్యార్థుల హగ్ ఏ బుక్



ఈఫిల్ టవర్ వద్ద పూర్వ విద్యార్థి రఘువరన్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 14 : లీడ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ పిలుపు మేరకు దేశ విదేశాలలో తన పూర్వ విద్యార్థులు హగ్ ఏ బుక్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో అమెరికా, బ్రిటన్, సింగపూర్, మలేషియాలో ఉన్న విద్యార్థులు గతంలో హగ్ ఏ బుక్ క్యాంపెయిన్ నిర్వహించారు. హగ్ ఏ బుక్ ఉద్యమంగా చదువు కార్యక్రమంలో భాగంగా ఫ్రాన్స్‌లో ఉన్న రవి కుమార్ సోదరుడు, పూర్వ విద్యార్థి రఘువరన్ ప్రపంచ ప్రఖ్యాత ఈఫిల్ టవర్ ముందు హగ్ ఏ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘువరన్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంలో పుస్తకాలను చదివే సంస్కృతి రోజురోజుకూ పెరుగుతుందని, పుస్తక పఠనాన్ని ప్రతీ ఒక్కరు క్రమం తప్పకుండా కొనసాగించాలని కోరారు.